క్లుప్తంగా

అదనపు తరగతుల నిర్మాణ పనుల పరిశీలన



కేశవరంలో అదనపు తరగతుల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వెంకన్నబాబు

మండపేట: మండలంలోని కేశవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు సోమవారం పరిశీలించారు. త్వరితగతిన నిర్మాణాలను పూర్తి చేసి, వినియోగంలోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఆయన వెంట పాఠశాల పీఎంసీ చైర్మన్ ఆళ్ల శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ తుపాకుల ప్రసన్నకుమార్ ఉన్నారు.

పొదుపు చేయడం అలవర్చుకోవాలి



పొదుపు దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మండపేట: చిన్నతనం నుంచి డబ్బులు వృథా చేయకుండా, పొదుపును అలవర్చుకోవాలని స్థానిక సంఘం కాలనీలో ఉన్న ఎంపీపీ స్కూల్ హెచ్ఎం ముత్యాల మాణిక్యాంబ విద్యార్థులకు సూచించారు. పొదుపు దినోత్సవాన్ని సోమవారం స్కూల్లో ఘనంగా నిర్వహించారు. పొదుపు ఆవశ్యకత, డబ్బు, విద్యుత్, గ్యాస్, ఆహారం, నీరు తదితర వాటిని వృథా చేయకుండా ఆదా చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను ఆమె వివరించారు. ఉపాధ్యాయుడు చిట్టూరి వెంకట శ్రీధర్ పాల్గొన్నారు.

ఘనంగా అన్న సమారాధనలు



సత్యవాడలో అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు

కె.గంగవరం: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం అన్న సమారాధనలు ఘనంగా నిర్వహించారు. దేవీ నవరాత్రుల ఉత్సవాల ముగింపు సందర్భంగా కె.గంగవరం దంగేరు సెంటర్, సుందరపల్లి, సత్యవాడ గ్రామాల్లో ఈ అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. సాంస్కృతిక, భజన కార్యక్రమాలను నిర్వహించారు.

ఆయుష్మాన్ భారత్‌పై అవగాహన



యాప్‌లో ఆరోగ్య వివరాలను నమోదు చేస్తున్న పీహెచ్‌సీ అధికారులు

కపిలేశ్వరపురం: అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రత్నకుమారి ఆదేశాల మేరకు ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంపై ఆస్పత్రి సిబ్బందికి సోమవారం అవగాహన కల్పించారు. కపిలేశ్వరపురం గ్రామ సచివాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆస్పత్రి అధికారులు మాట్లాడుతూ గ్రామాల్లో వైద్య, ఆరోగ్య కార్యక్రమాలను షెడ్యూల్ ప్రకారం కొనసాగించాలన్నారు. అనంతరం అంగర, పడమర ఖండ్రిక గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి, ప్రజల ఆరోగ్య వివరాలను సంబంధిత యాప్‌లో నమోదు చేశారు. ఆస్పత్రి ఎంపీహెచ్ఈఓ జుత్తుగ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్యంతో విజయాలు సాధించాలి

రామచంద్రపురం: విద్యార్థి దశలో లక్ష్యాలను నిర్దేశించుకుని, పట్టుదలతో విజయాలు సాధించాలని ఏఎస్సై కె.సీతారాం అన్నారు. కళాశాలల్లో ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టం కఠినంగా శిక్షిస్తుందని హెచ్చరించారు. స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. వివిధ చట్టాలపై ఏఎస్సై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కేసీ సత్యలత అధ్యక్షత వహించారు. వైస్ ప్రిన్సిపాల్ వై పద్మజ, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాలలు, మహిళా చట్టాలపై అవగాహన

రామచంద్రపురం రూరల్: జిల్లా ఎస్పీ శ్రీధర్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ ఖాదర్ బాషా పర్యవేక్షణలో దిశ డీఎస్పీ మురళీమోహన్ ఆధ్వర్యంలో హసన్‌బాద జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం విద్యార్థులకు బాలలు, మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. చిన్నారులు, మహిళలపై జరుగుతున్న నేరాలు తదితర అంశాలపై దిశ మహిళా ఎస్సై ఎంవీ రమణమ్మ అవగాహన కల్పించారు.

పట్టణ సంపూర్ణాభివృద్ధికి పటిష్ట ప్రణాళిక

- మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మంత్రి వేణు
- 14 అంశాలకు సభ్యుల ఆమోదం



డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కును అందజేస్తున్న మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ

రామచంద్రపురం: పట్టణంలోని అన్ని వార్డులను సంపూర్ణాభివృద్ధి చేసేందుకు పటిష్ట ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. పురపాలక సంఘ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన సాధారణ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం సోమవారం జరిగింది. ఎక్స్ అఫీషియో సభ్యునిగా మంత్రి వేణు హాజరయ్యారు. మొత్తం 15 అంశాలను సభ్యుల ఆమోదం కోసం సమావేశంలో ప్రవేశపెట్టారు. 2017లో జరిగిన పనులకు సంబంధించిన రూ.4.35 లక్షల బిల్లులను చెల్లించే ఒక్క అంశాన్ని వాయిదా వేయాలని సభ్యులు కోరగా, చైర్‌పర్సన్ శ్రీదేవి దీనిని వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు.

ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యం

అనంతరం మంత్రి వేణు మాట్లాడుతూ పార్కులతో పాటుగా ప్రజల ఆహ్లాదం, ఆరోగ్యం కోసం జిమ్‌లను కూడా మెరుగుపరుస్తున్నట్టు చెప్పారు. గుడ్‌మార్నింగ్ కార్యక్రమంలో వెలుగు చూస్తున్న పలు సమస్యలను కూడా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వార్డుల్లో స్వచ్ఛత కోసం చేపడుతున్న చర్యలను ప్రజలకు వివరించాలని కౌన్సిలర్లకు మంత్రి విజ్ఞప్తి చేశారు. ప్రజల్లో చెత్త సేకరణపై అవగాహన తేవాలని కోరారు. తమ వార్డుల్లో కౌన్సిలర్లు ప్రజలతో మమేకమవుతూ, వారి సమస్యల పరిష్కారానికి పాటుపడాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి, డీఈ డి.దుర్గాప్రసాద్, వైస్ చైర్మన్లు కోలమూరి శివాజీ, చింతపల్లి నాగేశ్వరరావు, కౌన్సిలర్లు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఆసరా చెక్కు అందజేత

వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాటుపడుతున్నారని మంత్రి వేణుగోపాలకృష్ణ అన్నారు. మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో మున్సిపాలిటీలోని 18 సంఘాలకు చెందిన 185 మంది సభ్యులకు వైఎస్సార్ ఆసరాకు సంబంధించిన రూ.35,29,560 చెక్కును డ్వాక్రా మహిళలకు ఆయన అందజేశారు. చైర్‌పర్సన్ శ్రీదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో.. పట్టణానికి చెందిన డ్వాక్రా మహిళలు దుశ్శాలువాతో మంత్రి వేణును ఘనంగా సత్కరించారు. మెప్మా అధికారులు, డ్వాక్రా సంఘాల ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

మారనున్న పల్లెల స్వరూపం

- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా
- 'స్వచ్ఛత–మన బాధ్యత' నిర్వహించిన మంత్రి వేణు



బాపనయ్యచెరువు గ్రామంలో జరిగిన సభలో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

రామచంద్రపురం రూరల్: స్వచ్ఛత–మన బాధ్యత వంటి అద్భుత కార్యక్రమాలతో పల్లెల స్వరూపాలే మారిపోతాయని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. మండలంలోని బాపనయ్యచెరువు గ్రామంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం స్వచ్ఛత–మన బాధ్యత కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ మంత్రి వేణు రూపొందించి, రామచంద్రపురం నియోజకవర్గంలో అమలు చేస్తున్న స్వచ్ఛత–మన బాధ్యత తనను విశేషంగా ఆకట్టుకుందన్నారు. నెల రోజుల పాటు ఈ కార్యక్రమ అమలు తీరును నివేదిక రూపంలో రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు. రాష్ట్రమంతా ఈ కార్యక్రమం అమలు చేసే అవకాశం ఉందన్నారు. గతంలో తాను ఈ విధమైన కార్యక్రమాలు చేయాలని చూశానన్నారు. మంత్రి వేణు మంచి ప్రణాళికతో దీనిని అమలు చేస్తున్నారని, ప్రతి గ్రామంలో ప్రజలు భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు. మంత్రి వేణు మాట్లాడుతూ మన గ్రామాన్ని ఎప్పుడూ శుభ్రంగా ఉంచుతూ, ఎవరూ రోగాల పాలుకాకుండా కాపాడే పారిశుధ్య కార్మికులను ప్రాథమిక వైద్యులుగా భావించాలని అన్నారు. ఇళ్లల్లో కూరగాయలు, ఇతర తడి వ్యర్థాలను చిన్న గొయ్యిలో పాతిపెడితే, మూడు నెలల తర్వాత ఎరువుగా మారుతోందన్నారు. పెరటి మొక్కలకు దీనిని వాడుకోవచ్చన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను భద్రపరిచి, రీసైక్లింగ్ చేసే వారికి ఇవ్వడం ద్వారా ఆదాయం పొందవచ్చని చెప్పారు. గ్రామానికి పరిశుభ్ర వాతావరణం దక్కుతుందని వివరించారు. సర్పంచ్ పిల్లి సూర్యప్రకాశరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాసరావు, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీలు నరాల రాజ్యలక్ష్మి, శాకా బాబీ, కె.గంగవరం ఎంపీపీ పంపన నాగమణి, ఎంపీటీసీ నున్న సత్యవతి, డీపీఓ కృష్ణకుమారి, మండల ప్రత్యేక అధికారి రాజు, తహసీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ కీర్తిస్పందన పాల్గొన్నారు.

మెయిన్ రోడ్డులో అంబేడ్కర్, జగజ్జీవన్‌రామ్ విగ్రహాలు

- కౌన్సిల్ సమావేశం ఆమోదం
- మహనీయులకు మంచి గుర్తింపన్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు



సమావేశంలో చైర్‌పర్సన్ దుర్గారాణి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్, మాజీ ఉప ప్రధాని బాబూ జగజ్జీవన్‌రామ్ విగ్రహాలను మండపేట మెయిన్ రోడ్డులో ఏర్పాటు చేసేందుకు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. మండపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అధ్యక్షతన సోమవారం స్థానిక కౌన్సిల్‌హాలులో జరిగింది. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సమావేశానికి ఎక్స్ అఫీషియో సభ్యులుగా హాజరయ్యారు. పట్టణంలో మారుమూల ఉన్న ఆయా నేతల విగ్రహాలను మెయిన్ రోడ్డులో ఏర్పాటు చేయాలన్న దళిత సంఘాల కోరిక మేరకు, ఎమ్మెల్సీ తోట చొరవ తీసుకుని ఈ అంశాన్ని అజెండాలోకి తెచ్చేందుకు కృషి చేశారు. విగ్రహాల ఏర్పాటు అంశాన్ని సభ్యులు ఆమోదించారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ మహనీయుల విగ్రహాలను మారుమూల ప్రాంతాల్లో కాకుండా, మెయిన్ రోడ్డులో ప్రతిష్ఠించుకోవడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. ఇందుకు అనువైన స్థలాన్ని ఎంపిక చేసి, త్వరితగతిన విగ్రహాల ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. పలు అంశాలపై ప్రతిపక్ష సభ్యుల ఆరోపణలకు అధికార పక్ష సభ్యులు దీటుగా బదులిచ్చారు.

క్రైస్తవుల శ్మశాన వాటిక స్థలంపై చర్చ

ఏడో వార్డులో అసంపూర్తిగా ఉన్న ఎస్సీ కమ్యూనిటీహాలుకు నిధుల కేటాయింపుపై కౌన్సిలర్ మందపల్లి రవికుమార్ మాట్లాడారు. గత ప్రభుత్వం ఎస్సీ కమ్యూనిటీహాలు అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని, ఎమ్మెల్సీ తోట వచ్చాక అభివృద్ధికి నోచుకుంటోందన్నారు. కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ క్రైస్తవుల శ్మశానవాటికకు సొంతంగా స్థలం ఇస్తానని గతంలో ఎన్నికల్లో ఎమ్మెల్యే వేగుళ్ల హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఆ స్థలం ఎక్కడుందో, దాని రికార్డులు చూపించడం లేదన్నారు. ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ క్రైస్తవుల శ్మశాన వాటికకు స్థలం ఇచ్చామని, అప్పటికే పట్టణంలో రెండు ఫెలోషిప్‌లు ఉండటంతో రెండింటికీ చెందేలా డేనియల్‌పాల్‌కు ఇచ్చినట్టు వివరించారు. మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు రెడ్డి రాజుబాబు మాట్లాడుతూ స్థలాన్ని తీసుకువెళ్లి తనకు అనుకూలమైన వ్యక్తి చేతుల్లో పెట్టడం సరికాదని, స్థలం వివరాలు క్రైస్తవులందరికీ తెలపాలని లేదా మున్సిపాల్టీకి అప్పగించాలని సూచించారు. దీనిపై అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. పట్టణంలో అభివృద్ధి పనుల విషయమై ఎమ్మెల్యే వేగుళ్ల చేసిన ఆరోపణలపై ఎమ్మెల్సీ తోట దీటుగా బదులిచ్చారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో జరుగుతున్న అభివృద్ధి వారి కళ్లకు కనిపించడం లేదని విమర్శించారు. నియోజకవర్గంలో గ్రామగ్రామాన పెద్దఎత్తున జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ప్రజలంతా సంతోషంగా ఉంటే, ప్రతిపక్ష నేతలు ఓర్వలేని స్థితిలో అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. అజెండాలోని పలు అంశాలపై సభ్యులు చర్చించి, ఆమోదించారు.

పేదల పక్షపాతి సీఎం జగన్

ద్వారపూడి 'గడప గడపకూ'లో ఎమ్మెల్సీ తోట



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతిగా, వారి అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరుతున్న లబ్ధితో గడిచిన నాలుగేళ్లలో పేదవర్గాల వారి జీవన ప్రమాణాలు ఎంతో మెరుగుపడ్డాయని పేర్కొన్నారు. సర్పంచ్ ఈతకోట కిన్నెర, ఉప సర్పంచ్ తులా శేషారావు ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ తోట ద్వారపూడిలో పర్యటించారు. ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ చిక్కాల శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ తులా శ్రీరంగారావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు దంతులూరి శ్రీరామవర్మ తదితరులతో కలిసి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి గుడి, పాత బట్టల మార్కెట్ వీధి తదితర ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి స్థానికులతో మాట్లాడారు. స్థానికులు చెప్పిన సమస్యలపై ఎంపీడీఓ ఐ.రాజు, పంచాయతీ అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్సీ తోట.. మీడియాతో మాట్లాడుతూ సీఎం జగన్ నేతృత్వంలో రాష్ట్రంలో ప్రజారంజక పాలన సాగుతోందన్నారు. జన్మభూమి కమిటీలు, కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా, అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాల లబ్ధి చేకూరుతోందన్నారు. సంక్షేమ పాలన కోసం జగన్‌ను మరలా సీఎంగా చేయాలని కోరారు. మండల సేవాదళ్ కన్వీనర్ పోతుల రాంబాబు, పార్టీ నాయకులు యరగతపు విజయ్, సంగిశెట్టి రమేష్, సత్తి సత్తిబాబు, పోతుల దుర్గాప్రసాద్, పాలినాటి సత్యనారాయణ, దండుబోయిన సూర్యనారాయణమూర్తి, నామాల వెంకన్న, పుట్టపూడి సత్తిబాబు, సత్తి రాంబాబు, నామాల శ్రీనివాసరావు, తొంటాపు సత్తిపండు, గూడూరి సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది రక్షణకు ఆర్టీసీ కట్టుబడి ఉంది

ద్వారాకా తిరుమలరావు



రామచంద్రపురం డిపోను పరిశీలిస్తున్న ఆర్టీసీ ఎండీ ద్వారాకా తిరుమలరావు

రామచంద్రపురం రూరల్: డ్యూటీలో ఉన్న ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లపై దాడులను ఖండిస్తున్నామని, వారి రక్షణకు సంస్థ కట్టుబడి ఉందని ఆర్టీసీ వైస్ చైర్మన్, ఎండీ ద్వారాకా తిరుమలరావు అన్నారు. రామచంద్రపురం ఆర్టీసీ డిపోను ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులు, ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా సంస్థ పనిచేస్తుందన్నారు. సంస్థకు ఆదాయం పెరిగేలా అందరూ కష్టపడి పనిచేయాలని కోరారు. బకాయిలను సంస్థ చెల్లిస్తుందన్నారు. కార్గో, పార్శిల్ ఆదాయం పెరిగేలా కృషి చేయాలన్నారు. డోర్ డెలివరీకి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రయాణికుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలన్నారు. సంస్థ కార్మికులు, ఉద్యోగులు ఎస్‌బీఐ బ్యాంకు రూపే కార్డు ద్వారా అధిక ఇన్సూరెన్స్ పొందేలా ఎస్‌బీఐతో ఒప్పందం జరిగిందన్నారు. అనంతరం డిపోను పరిశీలించి సిబ్బందితోను, ప్రయాణికులతోను మాట్లాడారు. ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గోపీనాథ్‌రెడ్డి, డీపీటీఓ ఆర్‌వీఎస్ నాగేశ్వరరావు, డిపో మేనేజర్ కొడమంచిలి వెంకటేశ్వర్లు, డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్, సీఐ దుర్గారావు, ఎస్సై సురేష్ బాబు, ఆర్టీసీ అధికారులు, సెక్యూరిటీ, గ్యారేజీ, ట్రాఫిక్ అధికారులు, సిబ్బంది, యూనియన్ల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

నానో యూరియాపై అవగాహన ఉండాలి

కాజులూరు: నానో యూరియా వాడకంపై రైతులు అవగాహన పెంచుకోవాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. సోమవారం గొల్లపాలెంలో ఆయన రైతులతో మాట్లాడారు. పొలంలో అడుగులోతుకు పైబడి వానపాములు వంటివి జీవిస్తాయన్నారు. ఇవి భూసారం పెంచేందుకు దోహదపడతాయన్నారు. యూరియా పొలాల్లో అధికంగా వేయటం ద్వారా ఈ వానపాములు నశిస్తున్నాయన్నారు. ఫలితంగా భూసారం తగ్గిపోతుందన్నారు. రైతులు యూరియా వాడకాన్ని తగ్గించి, ని స్థానంలో నానో యూరియాను వినియోగించుకోవచ్చన్నారు. ద్రవరూపంలో ఉండే నానో యూరియా బాటిల్ ధర రూ.225 వరకూ ఉంటుందని, ఇది బస్తా సాధారణ యూరియాతో సమానమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వీఏఏ శిరీషా, వనుం శ్రీరమ్య పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థులకు కేంద్ర ఉపకార వేతనాలు



స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, అధ్యాపకులు

మండపేట: ప్రతిభావంతులైన విద్యార్థులకు కేంద్ర మానవ వనరుల శాఖ ఇచ్చే ఉపకార వేతనాలకు మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్టు సోమవారం ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాసరావు తెలిపారు. బీఏ ఫస్టియర్ విద్యార్థి కోరుకొండ కరిమలశ్రీను, బీకామ్ ఫస్టియర్ విద్యార్థి గెడ్డం శ్రీరమ్య ఈ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారన్నారు. వీరికి ఏడాదికి రూ.10 వేల వంతున మూడేళ్లు రూ.30 వేల ఆర్థికసాయాన్ని ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు.

ఎంపీఎస్ స్కూల్ తెరవాలని రాస్తారోకో



కలువపువ్వు సెంటర్‌లో రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

మండపేట: భాగస్వాములతో సంబంధం లేకుండా పట్టణంలోని ఎంపీఎస్ స్కూల్ తెరవాలని డిమాండ్ చేస్తూ సోమవారం సాయంత్రం విద్యార్థులు, తల్లిదండ్రులు స్థానిక కలువపువ్వు సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఇద్దరు భాగస్వాముల మధ్య నెలకొన్న వివాదంతో దసరా సెలవులు ముగిసినా ఎంపీఎస్ స్కూల్ ఇంకా తెరుచుకోని విషయం విదితమే. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చొరవ తీసుకుని, డీఈఓ కమలకుమారి, పోలీస్ అధికారులతో మాట్లాడి శనివారం పాఠశాలను తెరిపించేందుకు కృషి చేశారు. అయితే ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరుకాకపోవడంపై డీఈఓ విచారణ జరిపారు. ఈ సందర్భంగా సెలవుల నేపథ్యంలో పాఠశాలను శుభ్రం చేసి సోమవారం తెరుస్తామని హెచ్ఎం బదులిచ్చినట్టు డీఈఓ తెలిపారు. కాగా సోమవారం విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాఠశాలకు వచ్చి.. భాగస్వాముల ప్రమేయం లేకుండా పాఠశాలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కలువపువ్వు సెంటర్‌లో బైఠాయించి, రాస్తారోకో చేశారు. వీరి ఆందోళనకు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ మద్దతు తెలిపారు. రామచంద్రపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్, సీఐ శ్రీధర్‌కుమార్, ఎస్ఐ ఎం అశోక్ వారికి సర్దిచెప్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేదు. భాగస్వాములు రావద్దని చెప్పలేమని, హెచ్ఎం పర్యవేక్షణలో పాఠశాలను నడపాలని పోలీసులు కోరినా వారు అందుకు అంగీకరించలేదు. మంగళవారం నుంచి ఆందోళన ఉధృతం చేస్తామని రాస్తారోకో విరమించారు.

బాల్య వివాహాలు నేరం

కపిలేశ్వరపురం: నిర్ణీత వయసు రాకుండా పెళ్లిళ్లు చేయడం చట్టపరంగా నేరమని పలువురు వక్తలు పేర్కొన్నారు. బాల్య వివాహాల నిషేధ చట్టం–2006పై ఐసీడీఎస్ కపిలేశ్వరపురం సీడీపీఓ కార్యాలయం పరిధిలోని వల్లూరులో అంగన్‌వాడీలు సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు మానవహారంగా ఏర్పడ్డారు.

ఢిల్లీలో 'మన మట్టి' అందజేత



మట్టి కలశాన్ని అందిస్తున్న విజయ్

కపిలేశ్వరపురం: మన దేశం–మన మట్టి కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల్లో సేకరించిన మట్టిని మండల ప్రతినిధులు సోమవారం ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో నిర్వహించిన దేశవ్యాప్త కార్యక్రమంలో అందజేశారు. ఆజాదికా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా సేకరించిన మట్టిని ఈ నెల 12న కపిలేశ్వరపురం మండల పరిషత్ కార్యాలయంలో ఓ కలశంలో చేర్చారు. వడ్లమూరు గ్రేడ్–5 కార్యదర్శి విజయ్, వాకతిప్ప కార్యదర్శులు శివచక్రవర్తి, యశ్వంత్ దీనిని ఢిల్లీలో అందజేశారు.

ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యం



యర్రపోతవరంలో రోగులకు మందులు అందిస్తున్న ప్రజాప్రతినిధులు




జగన్నాయకులపాలెంలో మందుల కిట్లు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

కె.గంగవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని వైస్ ఎంపీపీ దూడల నాగేశ్వరరావు, సర్పంచ్ పిల్లి రాంబాబు అన్నారు. యర్రపోతవరంలో సోమవారం ప్రాథమిక పాఠశాల ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంతో ప్రతిఒక్కరికీ ఆరోగ్య పరీక్షలు ఉచితంగా నిర్వహించి, మందులు ఉచితంగా అందిస్తున్నారని వారు చెప్పారు. ప్రతిఒక్కరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సచివాలయాల మండల కన్వీనర్ తోకల శ్రీను, ఎంపీటీసీ కొప్పిశెట్టి లక్ష్మణ్, కుడుపూరు సర్పంచ్ పిల్లి రాంబాబు, మాజీ ఉప సర్పంచ్ మేడిశెట్టి రాంబాబు వైద్యులు, గ్రామ పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జగన్నాయకులపాలెంలో ఆరోగ్య సురక్ష

రామచంద్రపురం రూరల్: మండలంలోని జగన్నాయకులపాలెంలో సర్పంచ్ అనిశెట్టి రామకృష్ణ, ఎంపీటీసీ బళ్ల సుధాకరరావు ఆధ్వర్యంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరిగింది. ఇందులో 321 మందికి వైద్య సేవలందించారు. ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ రెడ్నం సతీష్, సర్పంచ్‌లు కొత్తపల్లి అరుణ, నక్కిన దొరబాబు, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ అహ్మద్ అలీషా(బాబ్జీ), ఏపీఐడీసీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, ఎంపీడీఓ ఎస్. కీర్తి స్పందన తదితరులు రోగులకు మందుల కిట్లు అందజేశారు. వైద్యులు ఎస్.ప్రశాంతి, మమత, ఆనంద్, సజిత్ కిషన్, హెల్త్ సూపర్‌వైజర్ నార్ని గంగాధర్, సీహెచ్ఓ వీరవేణి, పీహెచ్ఎన్ సుబ్బలక్ష్మి, హెచ్‌వీ వరలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎస్ఈఏ సర్వేను విజయవంతం చేయాలి



సర్వే వివరాలు చెబుతున్న ఏపీఓ ఆదినారాయణమూర్తి

రామచంద్రపురం రూరల్: దేశవ్యాప్తంగా నవంబరు 3న చేపట్టే స్టేట్ ఎడ్యుకేషనల్ ఎచీవ్‌మెంట్(ఎస్ఈఏ) సర్వేను విజయవంతం చేయాలని అధికారులు కోరారు. రామచంద్రపురం వీఎస్ఎం కళాశాలలో సోమవారం రామచంద్రపురం ఎంఈఓ మానుపూడి శ్రీనివాస్ అధ్యక్షతన సోమవారం శిక్షణ కార్యక్రమం జరిగింది. రామచంద్రపురం డీవైఈఓ నరసింహఫణి, డీసీఈబీ సెక్రటరీ బి.హనుమంతరావు, డీఈఓ కార్యాలయ ఏడీ నక్కా సురేష్, సమగ్ర శిక్షణ ఏఎంఓ పిల్లి రాంబాబు, డీఈఓ కార్యాలయ ఏపీఓ డి.ఆదినారాయణమూర్తి తదితరులు మాట్లాడారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని మదింపు చేసేందుకు ఈ ఏడాది సర్వేను నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. 3, 6, 9 తరగతుల విద్యార్థులకు నిర్వహించే ఈ సర్వేకు డిగ్రీ, ఇంజనీరింగ్ విద్యార్థులు ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లుగా వ్యవహరిస్తారన్నారు. రామచంద్రపురం, కె.గంగవరం, రాయవరం మండలాలకు చెందిన ఎంఈఓలు వాసంశెట్టి నాగేశ్వరి, చోడిశెట్టి ఆంజనేయులు, పి.లక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణ, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు, సీఆర్ఎంటీ(సీఆర్‌పీలు)లు పాల్గొన్నారు..

ఇజ్రాయిల్ దుశ్చర్యలను ఆపేందుకు కేంద్రం చొరవ చూపాలి

రామచంద్రపురం: పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ సాగిస్తున్న నరమేధాన్ని ఆపేలా, పాలస్తీనాలో శాంతి నెలకొల్పేలా కేంద్ర ప్రభుత్వం అంతర్జాతీయంగా చొరవ చూపాలని వివిధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, జమాతే ఇస్లామీ హింద్, దళిత సంఘాల సంయుక్తాధ్వర్యంలో రామచంద్రపురం ప్రధాన రహదారిలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు చీకట్ల వెంకటేశ్వరరావు, జమాతే ఇస్లామీ హింద్ రామచంద్రపురం శాఖ అధ్యక్షుడు ఫరీద్ హమ్మద్, ఇతర నాయకులు మాట్లాడుతూ తమ మాతృదేశం, జాతి రక్షణ కోసం పాలస్తీనా ప్రజలు తెగించి పోరాడుతున్నారన్నారు. ఇజ్రాయిల్ 75 ఏళ్లుగా పాలస్తీనా ప్రజలపై అరాచకాలు చేస్తూనే ఉందని, వారి ఆస్తులను, భూములను స్వాధీనం చేసుకుంటూ విధ్వంసానికి పాల్పడుతోందని ఆరోపించారు. మానవత్వాన్ని మరిచి గాజా నివాసాలపై ఇజ్రాయిల్ కురిపించిన బాంబుల దాడిలో వేలాది మంది మరణించారని, ఇందులో చిన్నారులు కూడా ఉన్నారని పేర్కొన్నారు. ఇప్పటికీ అక్కడి ఆస్పత్రులు, పాఠశాలలను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయిల్ దాడులు చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా,ఐక్యరాజ్య సమితి తక్షణమే ఇజ్రాయిల్‌పై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ ఉమ్మడి జిల్లా నాయకుడు వెంటపల్లి భీమశంకర్ , పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బి.సిద్ధూ, అంబటి కృష్ణ, వి.రామకృష్ణ, లాజర్, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.